
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 6 । జనవరి । 2023


అక్రమ నిర్మాణాలు నిలిపివేత 8లో


యథేచ్ఛగా క్యాట్ ఫిష్ అమ్మకాలు 8లో


కూర్మన్నపాలెంలో గజం రూ.71 వేలు 8లో

న్యూస్‌రీల్

విదేశీయుల సందడి


సీలేరు వచ్చిన విదేశీయులు

సీలేరు: సీలేరులో గురువారం విదేశీయులు సందడి చేశారు. ఇక్కడి యూసీఐఎం చర్చి పాస్టర్ మనష్షే ఆహ్వానం మేరకు జర్మనీ దేశం నుంచి వచ్చిన 14 మంది విదేశీయులు కొంతసేపు చర్చిలో గడిపారు. అనంతరం రాసబెడ గ్రామానికి వెళ్లారు. గిరిజన సాంస్కృతిక, సంప్రదాయ ఆచారాలపై గిరిజనుల నుంచి తెలుసుకన్నారు. వారితో కాసేపు మమేకమయ్యారు. అనంతరం తిరుగు పయనమయ్యారు.

పందెంరాయుళ్లపై బైండోవర్

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్ పరిధిలో 12 మంది పందెంరాయుళ్లపై బైండోవర్ నమోదు చేశామని ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. దోనెలపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 15 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదుపులోకి తీసుకొన్న వారిని మండల మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచామని ఎస్‌ఐ పేర్కొన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పూచీకత్తులు రాయించినట్టు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఎవరైనా కోడిపందాలు, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చలిగాలుల విజృంభణ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు విజృంభిస్తున్నాయి.పొగమంచు ప్రభావం పెద్దగా లేదు. పలు చోట్ల గురువారం తెల్లవారుజామున తేలికపాటి జల్లులు కురిశాయి. పాడేరు మండలం మినుములూరులో 11 డిగ్రీలు,అరకులోయలో 15.5 డిగ్రీలు, చింతపల్లిలో 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉ దయం నుంచి ఏజెన్సీలో మబ్బు వాతావరణం నెలకొంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీయడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు.

అధ్యాపకులకు శిక్షణ ప్రారంభం

పాడేరురూరల్: నూతన విద్యావిధానంలో భాగంగా జిల్లా నోడల్ రిసోర్స్ సెంటర్‌లో ఈనెల 5నుంచి వచ్చేనెల 4వరకు ఐదు బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టిబ్బాయి గురువారం తెలిపారు. జిల్లాలోని ఉన్న అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు మొదటి బ్యాచ్ మూడు రోజులు శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. మొదటి బ్యాచ్‌కు మాస్టర్ ట్రైనీగా మర్రిపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.కృష్ణ, చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి సంతోషి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోని వైస్ ప్రిన్సిపాల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి
- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా


వైద్యబృందాలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వైద్యబృందాలు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా హెచ్చరించారు.గురువారం తన కార్యాలయంలో వైద్యబృందాలతో వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం పరిధిలోని ప్రోగ్రామ్ అధికారులు, ఇతర సిబ్బంది ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లోని వైద్యబృందాలు సక్రమంగా పనిచేయాలని, లేని పక్షంలో సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరరావు, డీఐవో డాక్టర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు,

అంతిమయాత్రలో పాల్గొన్న అశేష జనవాహిని



తులసీరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కన్నీటి వీడ్కోలు

తమకు వెన్నుదన్నుగా నిలిచిన మహావృక్షం కూలిపోయిందని పాడి రైతులు కుమిలిపోయారు.. ప్రగతి బాటలు పరిచిన మహనీయుడి నిష్క్రమణతో పల్లెలు తల్లడిల్లాయి.. ఆ పెద్దాయన వల్ల అనేక విధాలుగా లబ్ధి పొందిన వేలాదిమంది కన్నీరుమున్నీరయ్యారు.. పూలమాలలతో నివాళులర్పించారు.. తమ పెరటిలో 'తులసి' మొక్కవై తిరిగి జీవించాలని అశ్రునయనాలతో కడసారి ప్రార్థించారు.

- అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర
- పోటెత్తిన అభిమానులు, రైతులు, నాయకులు
- స్వచ్ఛంద బంద్ పాటించిన వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు

అనకాపల్లి రూరల్/యలమంచిలి/మునగపాక: అసమాన 'పాల'నా దక్షతతో విశాఖ డెయిరీని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లిన ఆడారి తులసీరావు ఇక లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేక అభిమానులు ఆవేదన చెందారు. మనసులోని ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచిన తులసీరావు పార్థివ దేహం గురువారం ఉదయం విశాఖ చేరుకుంది. తొలుత గాజువాకలోని డెయిరీ ప్రధాన కార్యాలయంలో భౌతిక కాయాన్ని కాసేపు ఉంచి, ఉద్యోగులు, స్థానికులు నివాళులర్పించిన తర్వాత యలమంచిలి తరలించారు. నేరుగా పాత సినిమాహాలు మైదానం వద్ద పార్థివ దేహాన్ని ఉంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించిన అనంతరం తులసీనగర్‌లో వున్న ఆడారి నివాసానికి పార్థివ దేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు, రైతులు, పలు పార్టీలకు చెందిన నాయకులు వెంట రాగా అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర సాగింది. పురవీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భజనలు, తప్పెటగుళ్లు, అనేక వాద్యాల నడుమ ఆయన అభిమానులు జోహార్ తులసీరావు అంటూ నినదించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తులసీరావు సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరిగాయి. పార్టీలకతీతంగా టీడీపీ, జనసేన, రైతు, ప్రజా సంఘాల నాయకులంతా తరలివచ్చారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు తులసీరావు పాడె మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

లౌడ్‌స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు

సీఎం సహా అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆడారి తులసీరావు భౌతికకాయాన్ని సందర్శించేందుకు రావడంతో సామాన్యులు కూడా తిలకించేలా తులసీరావు కుటుంబసభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పట్టణంలో పలుచోట్ల లౌడ్ స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ చేశారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలను సంతాప సూచకంగా స్వచ్ఛందంగా మూసివేశారు.

నివాళులర్పించిన ఇతర ప్రముఖులు

తులసీరావు పార్థివ దేహాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, రమణమూర్తి రాజు, పెట్ల ఉమా శంకర్ గణేష్, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, బండారు సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, పంచకర్ల రమేష్‌బాబు,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ ప్రగడ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షులు శరగడం చినఅప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ,రొంగలి జగన్నాథం, చింతలపూడి వెంకట్రామయ్య, కోలాగురువులు, వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావ్ నివాళులర్పించారు.

నాన్న ఆశయం నెరవేర్చాలి..

- కుటుంబ సభ్యులకు సీఎం వైఎస్ జగన్ ఓదార్పు
- తులసీరావుకు ఘన నివాళి


తులసీరావు కుమారుడు ఆనంద్‌కుమార్‌ను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అనకాపల్లి/గోపాలపట్నం: అధైర్యపడొద్దు ఆనంద్ అన్నా.. రమాకుమారి తల్లీ అంటూ ఓదార్చారు. నేనున్నానంటూ తులసీరావు సతీమణి జయమ్మకు చేతిలో చెయ్యి వేసి ధైర్యం చెప్పారు. 'వేలాదిమంది పాడి రైతుల యోగక్షేమాలు నాన్న నీకు అప్పగించారు.. ఆయన ఆశయం నెరవేర్చాల'ని ఆనంద్‌కుమార్‌కు హితబోధ చేశారు. అనారోగ్యంతో కన్నుమూసిన డెయిరీ దిగ్గజం, ఆంధ్రా కురియన్ ఆడారి తులసీరావుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం హెలికాప్టర్లో యలమంచిలి చేరుకున్నారు. పాత సినిమాహాలు మైదానంలో ఉంచిన తులసీరావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, ముకుళిత హస్తాలతో నమస్కరించారు. 20 నిమిషాలసేపు అక్కడ గడిపిన సీఎం, తులసీరావు కుమారుడు, వైఎస్సార్‌సీపీ విశాఖ వెస్ట్ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. తులసీరావు సేవలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 11.44 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి వచ్చారు. మధ్యాహ్నం 12.02 గంటలకు ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి బయలుదేరి వెళ్లారు. తిరిగి యలమంచిలి నుంచి 12.52 గంటలకు హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుని 1.08 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆయన వెంట మంత్రి బొత్స సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల 'జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహసారథి' (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 35 అసెంబ్లీ కోఆర్డినేటర్లు, 9,567 సచివాలయ కన్వీనర్లు, 1,07,916 గృహ సారథులు ఉంటారు.

మ్యూజియం పనులు వేగవంతం

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మైథిలి


సందర్శించిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మైథిలి

చింతపల్లి: మండలంలోని తాజంగి పర్యాటక కేంద్ర ప్రాంతంలో స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మైథిలి ఆదేశించారు. మండలంలోని తాజంగి ప్రాంతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.35 కోట్లతో నిర్మిస్తున్న మ్యూజియం పనులను గురువారం ఆమె పరిశీలించారు. పర్యాటకంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. మన్యం అందాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. అందాలకు లంబసింగి ప్రాంతం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. సమరయోధుల మ్యూజియం పనులు పూర్తయితే పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాస్, ఏడీ అశోక్, డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణే లక్ష్యంగా ఉపాధి


వీడియో సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

- అర్హులందరికీ పనులు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో వలసల నివారణ లక్ష్యంగా ఉపాధి పనులు కల్పించాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో ఐటీడీఏ కార్యాలయం నుంచి వీడియో సమావేశాన్ని నిర్వహించారు. గిరిజనాభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జాబ్ కార్డులు కలిగి ఉండి ఉపాధి పనులకు నోచుకోని గ్రామాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. మనబడి నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ఇంజనీరింగ్‌శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల పనులపై ఆయన సూచనలు చేశారు. వీటిని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి నిధులతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక ప్రాంతాల్లో మునగ మొక్కలు నాటాలని సూచించారు.జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనిచేయాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు.పెదబయలు మండలం దిగువ కుమడలో 30మంది చిన్నారులు ఆధార్ కార్డులు లేక పాఠశాలలకు రావడం లేదని ఇక్కడ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడిఈడు పిల్లలు అంతా బడుల్లోనే ఉండాలన్నారు. మండల కేంద్రాలలోని ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో పెండింగ్ అద్దెలు వసూలు చేయాలని గిరిజనేతర వ్యాపారులు ఆయా దుకాణాల్లో ఉంటే ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఈఈలు వీఆర్‌ఎం రాజు, లావణ్యకుమార్, కొండయ్యపడాల్, బాలసుందరబాబు, లీలాకృష్ణ,బాబు.ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాష్, ఏటీడబ్ల్యూవో రజని,ఎంఈవో సరస్వతి పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే


దారపల్లిలో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న స్టేట్ ఆడిట్ కమిటీ సభ్యులు


రికార్డులు పరిశీలిస్తున్న స్టేట్ ఆడిట్ కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనుల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని రాష్ట్ర పీఎంయూ సూపరింటెండెంట్ ఇంజినీర్ కుంచజనన ప్రకాష్‌రావు అన్నారు. మండలంలో నాడు–నేడు పనులను గురువారం స్టేట్ ఆడిట్ కమిటీ (అమరావతి) ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. దారపల్లి, కోడాపుట్టు, నందిమెట్ట, కర్రిముఖిపుట్టు, చెరువుపాకల,పెదగూడ పాఠశాలల్లో రెండో విడతలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు తనిఖీ చేశారు. వీటికి సంబంధించి రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.పనుల పురోగతిపై పాఠశాలల హెచ్ఎంల నుంచి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగిన పనులు సంతృప్తికరంగా ఉన్నట్టు రాష్ట్ర పీఎంయూ సూపరింటెండెంట్ ఇంజినీర్ కుంచజనన ప్రకాష్ రావు తెలిపారు. ఈ తనిఖీల్లో స్టేట్ ఆడిట్ కమిటీ సభ్యులు, మండల విద్యాశాఖ అధికారి చెల్లయ్య, సీఆర్‌పీలు గౌరిశంకర్, సురేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో లోపాలుంటే సరిదిద్దండి

జిల్లా ఓటరు నమోదు పరిశీలకుడు అహ్మద్‌బాబు


మాట్లాడుతున్న ఓటరు నమోదు పరిశీలకుడు అహ్మద్‌బాబు, చిత్రంలో కలెక్టర్, జేసీ, పీవోలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు ప్రక్రియలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని జిల్లా ఓటరు నమోదు పరిశీలకులు అహ్మద్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి ఓటరు నమోదుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తక్కువ ఓటరు, జనాబా నిష్పత్తి ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, తగిన కారణాలను విశ్లేషించాలని సూచించారు.ఎన్నికల విధులకు సంబంధించి సీఈవో నుంచి బీఎల్వో వరకు ఎన్నికల నిబంధనల మేరకు పనిచేయాలని ఆదేశించారు. గత రెండు సమావేశాల్లో పనుల పురోగతిపై పలు సూచనలు ఇచ్చినా ఆశించిన మేరకు పనులు జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, బీఎల్వోలు మాత్రం అది తమ పనికాదని, విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ విషయంలో కోరి ప్రమాదం తెచ్చుకోవద్దని హెచ్చరించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల తొలగింపులు, మార్పులు, చేర్పులను నియోజకవర్గాల వారీగా ఆయన సమీక్షించారు. అధికంగా ఓటర్ల తొలగింపు జరిగిన చోట మొత్తం ఓటర్లు, జనాభా నిష్పత్తిని పరిశీలించాలని సూచించారు.బీఎల్‌వోల పనుల రికార్డులను ఆయన పరిశీలించారు. బీఎల్వోల పనితీరు సక్రమంగా లేదని, విధులు పట్ల శ్రద్ధ చూపని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేవారు. కొత్తగా నమోదైన ఓటర్లకు ఎపిక్ కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 13 పోలింగ్ స్టేషన్ల జాబితాలను ప్రింట్, ఆయా కేంద్రాలకు పంపిణీపై ఆయన ఆరా తీశారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓటరు నమోదు పరిశీలకులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సమగ్రంగా వివరించారు.

మహిళా ఓటర్లే ఎక్కువ: కలెక్టర్ సుమిత్‌కుమార్

డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి 7,15,707 మంది ఓటర్లు నమోదు కాగా, ప్రస్తుతం తుది జాబితా ప్రచురణ నాటికి 13,096 మంది ఓటర్లు పెరగడంతో మొత్తం 7,28,803 మందికి చేరినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వీరిలో పురుషులు 3,53,071, మహిళలు 3,75,699, ఇతరులు 33 ఉన్నారని ఆయన వివరించారు. అరకు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,29,870, వీరిలో పురుషులు 1,12,364, మహిళలు 1,17,499 మంది ఉన్నారన్నారు. పాడేరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,30,090 కాగా పురుషులు 1,11,963 మంది, మహిళలు 1,18,111 మంది ఉన్నారని తెలిపారు. రంపచోడవరంలో మొత్తం ఓటర్లు 2,68,843 కాగా, పురుషులు 1,28,774 మంది, మహిళలు 1,40,089 మంది ఉన్నట్టు వెల్లడించారు. జేసీ శివశ్రీనివాస్, పీవోలు రోణంకి గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సబ్‌కలెక్టర్లు వి.అభిషేక్, శుభం బన్సాల్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో దయానిధి పాల్గొన్నారు.

ఏజెన్సీలో కలకలం

- ఇన్‌ఫార్మర్ నెపంతో సుబ్బయ్య హత్య
- భయాందోళనలో గిరిజనులు
- రెండేళ్ల క్రితమే వచ్చిన మావోయిస్టులు
- ఇంట్లో లేకపోవడంతో వెళ్లిపోయారని మృతుడి భార్య గౌరమ్మ వెల్లడి


సుబ్బయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


సంఘటనా స్థలంలో మావోయిస్టుల లేఖ


హత్యకు గురైన సుబ్బయ్య (ఫైల్)

చింతూరు: ఏజెన్సీలో కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని హతమార్చడంతో కలకలం రేగింది. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని చింతూరు మండలం బుర్కనకోటలో బుధవారం రాత్రి సోయం సుబ్బయ్య(35) అనే గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. సంఘటన స్థలంలో కుంట ఏరియా కమిటీ పేరుతో విడిచిన లేఖలో సుబ్బయ్య పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో 2018లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ అనే సహచరుడిని కోల్పోయినట్లు మావోయిస్టులు తెలిపారు. ఈ విషయంపై సుబ్బయ్యను హెచ్చరించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని, దీంతో అతనిని హతమార్చినట్లు లేఖలో స్పష్టం చేశారు.

- రెండేళ్ల క్రితం కూడా మావోయిస్టులు తన భర్తకోసం వచ్చారని, ఆ సమయంలో తన భర్త ఇంట్లో లేకపోవడంతో వారు వెళ్లిపోయారని సుబ్బయ్య భార్య గౌరమ్మ తెలిపింది.

తెరపైకి కుంట ఏరియా కమిటీ..

గతంలో చింతూరు మండలంలో మావోయిస్టులకు సంబంధించి శబరి ఏరియా కమిటీ క్రియాశీలకంగా వ్యవహరించేది. రాష్ట్ర విభజనకు ముందు శబరి ఏరియా కమిటీ కార్యదర్శి మొప్పు మొగిలి అలియాస్ నరేష్, రాష్ట్ర విభజన అనంతరం నగేష్ ఎన్‌కౌంటర్లో మృతిచెందారు. దీంతో శబరి ఏరియా కమిటీని తెలంగాణకు చెందిన చర్ల ఏరియా కమిటీలో విలీనం చేసి చర్ల, శబరి ఏరియా కమిటీగా వ్యవహరిస్తున్నారు.

- ప్రస్తుతం సుబ్బయ్య హత్యతో సరిహద్దునే ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుంట ఏరియా కమిటీ తెరపైకి వచ్చింది. ఆంధ్రాలోని బుర్కనకోట, జువ్విగూడెంకు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు అతిసమీపంలో ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుంట ఏరియా కమిటీ సరిహద్దుల్లోని ఆంధ్రా గ్రామాల్లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లుగా తెలుస్తోంది.
- సుబ్బయ్యను హతమార్చిన బుర్కనకోటలో 2015లో కూడా గ్రామానికి చెందిన కుంజా సీతారామయ్య, కుంజా బ్రహ్మయ్య అనే ఇద్దరు అన్నదమ్ములను కూడా మావోయిస్టులు హతమార్చారు.
- ఎటపాక మండలంలో మడివి రాజ్‌కుమార్ అనే వ్యక్తిని 2021 నవంబరులో హతమార్చిన మావోయిస్టులు 2022 ఏప్రిల్‌లో చింతూరు మండలం సరివెల వద్ద ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును మావోయిస్టులు దగ్ధం చేశారు.

క్లుప్తంగా

దివ్య దర్శన యాత్రకు కుందులూరు గ్రామస్తులు



తిరుమలకు బయలుదేరిన కుందులూరు గ్రామస్తులు

వీఆర్‌పురం: దివ్యదర్శనం యాత్రకు మండలంలోని కుందులూరు గ్రామం నుంచి 49మంది భక్తులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులో బయలుదేరినట్టు ధర్మప్రచారక్ ముత్యాల శ్రీరామకృష్ణయ్య గురువారం తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరిని తీసుకెళుతున్నట్టు ఆయన చెప్పారు. గ్రామంలో నిర్మించతలపెట్టిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పూర్తి కావాలని స్వామి వారి ఆశీస్సులు కోరుతూ భక్తులు ఈ యాత్ర చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతూరు సబ్‌డివిజన్ మహిళా కన్వీనర్ పద్మావతి,నోముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

ఎంవీపీ కాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన మిషన్(సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. విశాఖ సిటీ కంచరపాలెంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వేదికగా జరగనున్న ఈ మేళాలో 10 సంస్థలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. స్మైలెక్స్ లేబొరేటరీస్, డెక్కన్ కెమికల్స్, టెక్విన్స్ సాఫ్ట్‌వేర్, నోవల్ పేటెంట్ సర్వీస్, గ్రాపెక్స్, హెల్ప్ యువర్ నీడ్స్, గ్రీన్ పార్కు హోటల్, అడికో, పేటియం సర్వీస్‌లలో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహించనున్నారు.

యోగా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ రుషికొండ యోగా-వెల్‌నెస్ సెంటర్‌లో పీజీ డిప్లొమా యోగాలో 50, డిప్లొమాలో 80 సీట్లు, ఎంవీపీ కాలనీలోని పతంజలి యోగా కేంద్రంలో డిప్లొమా ఇన్ యోగాలో 80 సీట్లు, విజయనగరం జిల్లా బొబ్బిలి శ్రీ యోగ విద్య సంస్థాన్‌లో డిప్లొమా ఇన్ యోగాలో 60 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పీజీ డిప్లొమా కోర్సుకు ఏడాదికి ఫీజుగా రూ.16,500, డిప్లొమా కోర్సుకు రూ 10 వేలు ఫీజుగా చెల్లించాలని తెలియజేశారు.

యథేచ్ఛగా క్యాట్ ఫిష్ అమ్మకాలు



మద్దిగరువు సంతలో పెద్ద పరిమాణంలో ఉన్న క్యాట్ ఫిష్



ఇతర చేపలతో పాటు క్యాట్ ఫిష్ ముక్కలను వాటా వేసి అమ్మకాలు జరుపుతున్న వ్యాపారి

- మైదాన ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న వ్యాపారులు
- సంతల్లో విక్రయాలు

సాక్షి,పాడేరు: నిషేధిత క్యాట్ ఫిష్‌ను జిల్లాలోని పలు సంతల్లో యథేచ్ఛగా అమ్మకాలు జరుపుతున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని అసరాగా చేసుకుని వ్యాపారులు సంతల్లో ఈ ప్రమాదకర క్యాట్ ఫిష్‌ను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. జి.మాడుగుల మండలంలోని మారుమూల మద్దిగరువు సంతలో ప్రతీ గురువారం క్యాట్ ఫిష్ అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. ఈవారం కూడా పదికిలోల బరువు తూగే పెద్ద సైజులో ఉన్న ఈ చేపలను వ్యాపారులు తీసుకువచ్చి పలు చోట్ల దుకాణాలు వేసి అమ్మకాలు జరిపారు. క్యాట్ ఫిష్‌లను చెరువుల్లో పెంచడంతో పాటు అమ్మకాలను ప్రభుత్వం నిషేధించింది. మృతిచెందిన పలు రకాల జంతువులు, కోళ్ల వ్యర్థాలను వేసి పెంచే క్యాట్ ఫిష్‌ను తింటే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మైదాన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఆహార తనిఖీ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తుండడంతో అక్కడ అమ్మకాలు జరపడం లేదు. అయితే ఏజెన్సీలో తనిఖీలు లేకపోవడంతో పాటు,గిరిజనుల అమాయకత్వాన్ని అసరాగా చేసుకుని మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి తీసుకొచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. మద్దిగరువుతో పాటు, జి.మాడుగుల, అన్నవరం, హుకుంపేట, గుత్తులపుట్టు,సుంకరమెట్ట వారపుసంతల్లో క్యాట్ ఫిష్ అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి.

అధికారులను అప్రమత్తం చేస్తాం

క్యాట్ ఫిష్‌పై చాలా ఏళ్ల నుంచి నిషేధం ఉంది. ఈ చేపలను తింటే జీర్ణాశయంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.టైఫాయిడ్ జ్వరాలు,వాంతులు,విరేచనాలు,కడుపునొప్పి వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి.ఈచేపల విక్రయాలపై వైద్య ఆరోగ్యశాఖ,ఆహార తనిఖీ విభాగం అధికారులను అప్రమత్తం చేస్తాం.అన్ని సంతల్లోను తనిఖీలు చేపడతాం.గిరిజన ప్రాంత ప్రజలు ఈ క్యాట్ ఫిష్ చేపలను ఆహారంగా తీసుకుని అనారోగ్య సమస్యలను తెచ్చుకోవద్దు

– డాక్టర్ జమాల్ బాషా, డీఎంహెచ్‌వో,పాడేరు

ఆంగ్లంలో అదరగొట్టారు...



తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టుల వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

- తాళ్లపాలెం గురుకుల విద్యార్థులకు మంత్రి మేరుగు నాగార్జున కితాబు
- అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రాజెక్టుల పరిశీలన
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

కశింకోట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతిభ కలిగిన విద్యావంతులు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. దాని పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారన్నారు. విద్యార్థులకు చదువుకోవడానికి అమ్మ ఒడి కింద ఏటా రూ. 13500 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. అలాగే విద్యా దీవెన, విదేశాల్లో చదువుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి సీఎం విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేదలు కూడా చదువుకునే విధంగా ఉచితంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేర్చడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. బాగా చదువుకొని ఉత్తమ మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. వాటి పని తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు ఆంగ్లంలో ప్రాజెక్టుల గురించి వివరించడంతో ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను, హెచ్‌ఎం మళ్ల మాణిక్యం, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్, తరగతి గదులను, వంట శాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త రూపావతి ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల్లోను, ఇక్కడి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టుల ద్వారా బహుమతులు, ఉన్నతాధికారుల ప్రశంసలతో సాధించిన విజయాలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, పలు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిపై నృసింహ దీక్షల విరమణ



తిరుముళ్లతో సింహగిరికి తరలివస్తున్న దీక్షాధారులు



తిరుముళ్లతో దీక్ష విరమణకు వస్తున్న చిన్నారులు



కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన దీక్షధారులు
- అప్పన్నకు తిరుముడుల సమర్పణ
- శోభాయమానంగా శాంతికల్యాణం

సింహాచలం: సింహగిరిపై నృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని గురువారం శాస్త్రోక్తంగా జరిపించారు. 41 రోజుల మండల దీక్ష , 32 రోజుల దీక్ష చేసిన దీక్షాధారులంతా శిరసుపై తిరుముడులను పెట్టుకుని మెట్లమార్గంలో, ఘాట్‌రోడ్డులో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి వాటిని సమర్పించి, దీక్ష విరమణ చేశారు.

ఘనంగా నృసింహ హోమం

తొలుత సింహగిరికి తరలివచ్చిన దీక్షాధారులంతా తిరుముళ్లతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం దేవస్థానం వైదికులు దీక్షాధారులందరిచేత శాస్త్రోక్తంగా దీక్షా విరమణ చేయించారు. ఈ సందర్భంగా నృసింహ హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి సమర్పించారు. కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి, శాంతి కల్యాణాన్ని శోభాయమానంగా జరిపించారు. భక్తులకు స్వామివారి అక్షింతలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఏఈవో నరసింహరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దీక్ష విరమించిన వారిలో సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేత



పాత మీసేవా కేంద్రం వెనుక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

అరకులోయ రూరల్: మండలంలో పలు చోట్ల సాగుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధి యండపల్లివలస ప్రధాన రహదారిలో కాఫీ మ్యూజియం నిర్వాహకులు గోపి,సురేష్,నరేష్‌లకు చెందిన భవన నిర్మాణం, పాత మీసేవా కేంద్రం వెనుక ప్రణీత్‌కు చెందిన నిర్మాణ పనులు, రణజిల్లేడ రహదారిలో గిరిజనేతరుల రిసార్ట్స్,అరకులోయ సీకాలనీలో సాయిబాబా గుడి వద్ద ఓగిరిజనేతరుడి ఇంటి నిర్మాణ పనులను గురువారం ఆర్‌ఐ సత్యనారయణ,వీఆర్వోలు సాయిబాబా,కోటి సిబ్బందితో పరిశీలించి, నిలుపుదల చేశారు. ఈసందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ గిరిజన చట్టాలను అతిక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవిషయంపై తహసీల్దార్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా చట్టాలను అతిక్రమించి నిర్మాణాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఆయా మార్గాలలో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

- తాంబరం-న్యూటిన్‌సుకియా(06073) స్పెషల్ ఈనెల 8న తాంబరంలో ఉదయం 10.45 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం చేరుకుని, ఇక్కడి నుంచి 9వ తేదీ సోమవారం రాత్రి 12.05 గంటలకు బయల్దేరి మంగళవారం 10వ తేదీ రాత్రి 7.35 గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూటిన్‌సుకియా-తాంబరం(06074) స్పెషల్ ఈ నెల 11న రాత్రి 8.20 గంటలకు న్యూటిన్‌సుకియాలో బయల్దేరి 13వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారం తెల్లవారుజామున 5.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరుమార్గాలలో వాల్తేర్ డివిజన్ పరిధిలో దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంరోడ్, పలాస స్టేషన్లలో ఆగుతాయి.
- టాటా-మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(08885) స్పెషల్ టాటాలో ఈ నెల 6న ఉదయం 4.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8 గంటలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు వాల్తేర్ డివిజన్ పరిధిలో రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం , సింహాచలం నార్త్, దువ్వాడ స్టేషన్‌లలో ఆగుతుంది.
- హతియా-మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(08887) స్పెషల్ హతియాలో ఈనెల 7న ఉదయం 4.50 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8 గంటలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది. రాయగడ, పార్వతీపురం,బొబ్బిలి,విజయనగరం,సింహాచలంనార్త్,దువ్వాడలో ఆగుతుంది.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



సబ్ జూనియర్ విజేతలు



బెంచ్ ప్రెస్ చేస్తున్న క్రీడాకారుడు

- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 800 మంది క్రీడాకారులు
- 8వ తేదీ వరకు పోటీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో 27వ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ సహకారంతో జాతీయ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 వరకు పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాథ్ సింగ్, లియో పీటర్, నేషనల్ అఫీషియల్ అండిబోయిన లక్ష్మీదేవి, ఏపీ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భాస్కరరావు, అండిబోయిన అప్పారావు ఈ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్, మాస్టర్ 1,2,3 మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 18 రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. రోజు ఒక్కో కేటగిరిలో అత్యధిక లిఫ్ట్ చేసిన వారికి స్ట్రాంగ్‌మన్ టైటిల్ అందజేస్తారు. సాయంత్రం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శి సిహెచ్.వి. సత్యనారాయణ, టి.సత్యనారాయణ, కె.వి. భాస్కర్, జోగారావు, ఈశ్వరరావు సబ్ జూనియర్ కేటగిరీ విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రీడలతో మానసిక వికాసం



ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రబాబు

ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

మురళీనగర్ (విశాఖ ఉత్తర): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడలో ప్రవేశం కలిగి వుండాలని సూచించారు. దీని వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యాభ్యాసానికి రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. ముందుగా ఎమ్మెల్సీ రవీంద్రబాబు వాలీబాల్ క్రీడను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ రవీంద్రబాబుతోపాటు బి.రఘునాథరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, హరిబాబు, జె.రాజేంద్రప్రసాద్, కె.రత్నకుమార్, గోవర్ధనరావు, పీఎం బాషా, రాష్ట్ర ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్థానిక పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో గజం రూ.71 వేలు

- వీఎంఆర్‌డీఏ ఈ వేలానికి విశేష స్పందన
- 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. 23 ప్లాట్లు విక్రయాలు
- వీటి ద్వారా సంస్థకు రూ.23.13 కోట్లు ఆదాయం

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్లాట్ల ఈ-వేలం వీఎంఆర్‌డీఏకు కోట్లు కురిపించింది. కూర్మన్నపాలెంలో గజం ధర అత్యధికంగా రూ.71 వేలుకు వెళ్లింది. వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన వేలానికి విశేష స్పందన లభించింది. మొత్తం 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. అందులో 23 ప్లాట్ల విక్రయాల ద్వారా సంస్థకు రూ.23.13 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ-వేలం వివరాలను గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెం, పెదగంట్యాడ, మర్రిపాలెం, మాధవధార, మధురవాడ సైబర్ వ్యాలీ, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్లలో ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీ కింద 46 మిగులు ప్లాట్లకు ఈ నెల 3, 4 తేదీల్లో ఈ-వేలం ద్వారా విక్రయాలు చేపట్టారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసేందుకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. అధికారులు నిర్ణయించిన అప్‌సెట్ ధరకు రెట్టింపు మొత్తంలో ప్లాట్లను కొనుగోలు చేశారు.

కూర్మన్నపాలెం ప్లాట్లకు అత్యధిక ధర

ఈ వేలంలో 46 ప్లాట్లకు విక్రయాలు చేపట్టగా అందులో 23 ప్లాట్లు అమ్ముడయ్యాయి. 3వ తేదీన జరిగిన వేలంలో 14 ప్లాట్లు, 4వ తేదీన నిర్వహించిన వేలంలో 9 ప్లాట్లు అమ్మకాలు జరిగాయి. వీటిలోను కూర్మన్నపాలెం, మాధవధార, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న లేఔట్లలో ప్లాట్లను దక్కించుకోడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపించారు. ప్రధానంగా కూర్మన్నపాలెం ఫేజ్-6లో ఎంఐజీ-191 ప్లాట్‌లో గజంకు రూ.35 వేలు అప్‌సెట్ ధరగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.71 వేలుకు కొనుగోలు చేశారు. దీంతో 271.67 గజాలను రూ.1,92,88,570 పలికింది. అలాగే ఇదే ఫేజ్‌లో 192 ప్లాట్‌కు గజం రూ.70,700కు వెళ్లింది. అదే విధంగా మాధవధార లే అవుట్‌లో గజం రూ.68 వేలు, మధురవాడ సైబర్ వ్యాలీలో గజం రూ.60,900కు వెళ్లింది. అత్యల్పంగా డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్‌లో అప్‌సెట్ ధర గజం రూ.14 వేలు పెట్టగా.. కేవలం రూ.14900లకు కొనుగోలు చేశారు.

7న దాకమర్రి ఎల్‌ఐజీ ప్లాట్లకు లాటరీ

దాకమర్రిలో ఎల్‌ఐజీ ప్లాట్లను ఈ నెల 7వ తేదీన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు సంస్థ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ముందుగా రిజర్వ్ కేటగిరీలో వారికి లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఇందులో కేటాయింపులు రాని వారికి మళ్లీ జనరల్ కేటగిరీలో సదరు దరఖాస్తులను కలిపిన తరువాత లాటరీ తీస్తారని వివరించారు. లాటరీలో ప్లాట్ల కేటాయింపులు జరగని వారికి అదే రోజున ఎంఈడీని చెక్కు రూపంలో తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులందరూ ఈ లాటరీ ప్రక్రియకు హాజరవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.